మ్యామత్‌లకు పునర్జన్మ!

- అమెరికా శాస్త్రవేత్తల ప్రయోగం విజయవంతం
- మ్యామత్ డీఎన్ఏతో ఎలుకల అభివృద్ధి
- త్వరలో ఏనుగులపై ప్రయోగం చేయాలని యోచన

న్యూయార్క్, మార్చి 5: జురాసిక్ పార్కు సినిమాలో జరిగినట్టే.. నిజ జీవితంలోనూ సాధ్యపడుతుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. అంతరించిపోయిన జంతువుల పునఃసృష్టిలో అమెరికా శాస్త్రవేత్తలు పురోగతి సాధించారు. మంచు యుగం నాటి మ్యామత్ (జడల ఏనుగు)ల డీఎన్ఏతో ఎలుకలపై జరిపిన ప్రయోగం విజయవంతమైంది. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా ఒంటిపై దట్టమైన ఉన్ని కలిగిన ఎలుకలను అమెరికాకు చెందిన 'కోలోసస్ బయోసైన్సెస్'కు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఈ ప్రయోగాన్ని ఏనుగులపై చేయాలని శాస్త్రవేత్తలు ప్లాన్ చేస్తున్నారు. 2028 నాటికి మ్యామత్‌లను మళ్లీ సృష్టిస్తామన్నఆశాభావంతో ఉన్నారు.

ఇప్పటి పరిస్థితులను తట్టుకుంటాయా?

ఆసియాలో ఉండే ఏనుగుల డీఎన్ఏ 95 శాతం వరకు మ్యామత్‌లతో పోలి ఉంటాయి. అందువల్ల వీటిపై ప్రయోగాలు చేయాలని అనుకుంటున్నారు. అయితే, ఎలుకల్లో గర్భధారణ రెండు వారాలు మాత్రమే కాగా, ఏనుగుల్లో ఇది సుమారుగా రెండేండ్లు ఉంటుంది. సుదీర్ఘ కాలం పాటు ఉండే గర్భధారణ సమయాన్ని దాటుకొని మ్యామత్‌ల సృష్టి సాధ్యమేనా? అన్నది తెలియాల్సి ఉంది. ఈ జీవులను సృష్టించడం వల్ల ఆర్కిటిక్‌లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయి. అయితే, ప్రయోగాల ద్వారా సృష్టించే మ్యామత్‌లు మంచు పరిస్థితులను సమర్థవంతంగా తట్టుకుంటాయా? నీటి ఎకోసిస్టమ్‌కు సరిపోతాయా? అన్నది ప్రశ్నార్థకం.

ఇంధనం లేకుండానే అంతరిక్ష ప్రయాణం!

- నూతన 'శక్తి' ఆవిష్కరణ?
- నాసా శాస్త్రవేత్త వెల్లడి
- అదే నిజమైతే న్యూటన్ సూత్రానికి మార్పులు

న్యూయార్క్, మార్చి 5: నాసా శాస్త్రవేత్తలు అంతరిక్ష పరిశోధనల్లో గేమ్‌ఛేంజర్ లాంటి ఆవిష్కరణ చేశారు. ఇంధనం లేకుండానే అంతరిక్షంలో ప్రయాణించేందుకు వీలుగా నూతన 'శక్తి'ని కనుగొన్నట్టు, విద్యుత్తు క్షేత్రాలను వినియోగించడం ద్వారా ఇంధనం లేకపోయినా రాకెట్లకు కావాల్సిన థ్రస్ట్‌ను ఇది అందిస్తుందని వెల్లడించారు. ఈ మేరకు నాసాకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ చార్లెస్ బుహ్లెర్ తెలిపారు. నాసా నూతన ఆవిష్కరణ భౌతికశాస్త్ర నియమాలకు సవాలు విసురుతున్నది. 'ప్రతి ఒక్క చర్యకు అందుకు సమానమైన ప్రతిచర్య ఉంటుంది' అనే న్యూటన్ మూడో సూత్రాన్ని ఇది ఉల్లంఘిస్తున్నది. నాసా చెప్పేది నిజమైతే భౌతిక శాస్త్రం పుస్తకాల్లో సూత్రాలను తిరగరాయాల్సి ఉంటుంది. అంతరిక్ష ప్రయోగాల్లో విప్లవాత్మక మార్పులు జరుగుతాయి. ఇంధనం లేకుండానే అంతరిక్ష మిషన్లను చేపట్టవచ్చు. అయితే, ఇది ఎంతవరకు నిజమన్నది తెలియాల్సి ఉన్నది. ప్రయోగ దశలో ఉన్న ఇది వాస్తవరూపం దాలుస్తుందా? లేదా గతంలో చరిత్ర గతిలో కలిసిపోయిన స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్ టెక్నాలజీ 'ఎమ్‌డ్రైవ్'లాగా ప్రయోగశాలలో కలగానే మిగిలిపోతుందా? అన్నది చూడాలి. అయితే, తాము ఆవిష్కరించిన 'శక్తి'ని అర్థం చేసుకునేందుకు 'ఒక తెలివైన భౌతిక శాస్త్ర నిపుణుడు' అవసరమని చార్లెస్ ధీమాగా చెబుతున్నారు.

లోక్‌సభ సీట్ల పునర్విభజన వద్దు

- మరో 30 ఏండ్లు యథాతథ స్థితిని కొనసాగించాలి
- జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం
- ఇతర రాష్ట్రాలకు జనాభా నియంత్రణను నేర్పించండి
- అఖిలపక్ష భేటీలో తమిళ పార్టీల ఏకగ్రీవ తీర్మానం



బుధవారం చెన్నైలో జరిగిన అఖిలపక్ష భేటీలో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్

న్యూఢిల్లీ, మార్చి 5: వచ్చే ఏడాది తలపెట్టిన లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను డీఎంకే నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశం ఏకగ్రీవంగా తిరస్కరించింది. నియోజకవర్గాల పునర్విభజన తమిళనాడును బలహీనపరుస్తుందని, అది భారత ఫెడరల్ స్వభావానికి ముప్పు అని పేర్కొంటూ సమావేశం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. డీలిమిటేషన్, బలవంతంగా హిందీ అమలును వ్యతిరేకిస్తూ డీఎంకే అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వం వహించిన అఖిలపక్ష భేటీకి ప్రతిపక్ష అన్నాడీఎంకే, కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు, సినీనటుడు విజయ్‌కి చెందిన వీసీకే తదితర పార్టీలు హాజరు కాగా, బీజేపీ, దాని మిత్రపక్షాలైన ఎన్‌టీకే, తమిళ మానిళ కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించాయి. త్వరలో చేపట్టనున్న జనగణన ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం వల్ల తమిళనాడుతోపాటు దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్య హక్కులు ప్రభావితం అవుతాయని సమావేశంలో ఆమోదించిన తీర్మానంలో పేర్కొన్నారు. జనాభా నియంత్రణ చర్యలు చేపట్టిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని పార్లమెంట్‌లో తగ్గించడం సహించరానిదని మండిపడ్డారు. 1970 నాటి జనగణన ఆధారంగా జరిగిన పార్లమెంటరీ సీట్ల పునర్విభజనను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. యథాతథస్థితిని కనీసం మరో 30 ఏండ్లు కొనసాగించాలని స్టాలిన్ అన్నారు. ఈలోగా ఇతర రాష్ట్రాలకు కూడా జనాభాను నియంత్రించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఒక వేళ ఎంపీ సీట్ల సంఖ్యను పెంచినట్లయితే ఆ మేరకు రాష్ట్రాల వారీగా దామాషా ప్రాతినిధ్యాన్ని నిర్ధారించాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా జరిగే ఈ పోరాటంలో దక్షిణాది రాష్ట్రాలలోని ఇతర పార్టీలను కూడా కలుపుకొని జాయింట్ యాక్షన్ కమిటీని రూపొందించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

కేంద్రప్రభుత్వ కార్యాలయాల్లో హిందీని తొలగించాలి: స్టాలిన్ డిమాండ్

తమిళ భాషపై ప్రధాని మోదీ మాటల్లో చూపించిన ప్రేమ చేతల్లో కనిపించడం లేదని స్టాలిన్ విమర్శించారు. తమిళనాడులోని కేంద్రప్రభుత్వ కార్యాలయాల నుంచి ముందుగా హిందీని తొలగించి హిందీతో సమానంగా తమిళ భాషను అధికార భాషగా ప్రకటించాలని ప్రధానిని డిమాండ్ చేశారు.

లోక్‌సభ సీట్లు తగ్గరాదు: విజయ్

1971 జనాభా లెక్కల ఆధారంగా ఏర్పడిన 543 లోక్‌సభ స్థానాలను నిరవధికంగా స్తంభింపచేయాలని తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు, సినీ నటుడు విజయ్ బుధవారం డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన తమిళనాడుతోసహా ఇతర దక్షిణాది రాష్ట్రాలలో సీట్లు తగ్గితే అది శిక్షగా పరిగణించాల్సి వస్తుందని ఆయన అన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలకు అదనపు సీట్లు లభించి దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గితే తమకు ఆమోద యోగ్యం కాదని అఖిలపక్ష సమావేశానికి ముందు విడుదల చేసిన ఐదు పేజీల లేఖలో విజయ్ స్పష్టం చేశారు.

హిందియాగా మార్చాలనుకుంటున్నారు
కమల్‌హాసన్

హిందీయేతర రాష్ట్రాలలో హిందీని అధికార భాషగా చేపట్టాలంటూ బలవంతం చేయడం ద్వారా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 'ఇండియాను హిందియాగా' మార్చాలనుకుంటున్నదని సినీనటుడు కమల్‌హాసన్ విమర్శించారు. అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాష్ట్రాలలో హిందీని రుద్దడం ద్వారా బీజేపీ ఎన్నికల్లో గెలవాలనుకుంటున్నదని ఆరోపించారు. మన కల ఇండియా.. వారి కల హిందియా అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

వీర్యం నాణ్యంగా ఉంటే దీర్ఘాయుష్షు!
డెన్మార్క్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 5: వీర్య కణాల నాణ్యత, దీర్ఘాయువుకు మధ్య సంబంధం ఉందని తాజా అధ్యయనంలో తేలింది. నాణ్యమైన, చురుకైన వీర్య కణాలున్న వ్యక్తులు మూడేండ్లు ఎక్కువ జీవిస్తారని పరిశోధకులు గుర్తించారు. కోపెన్‌హెగెన్ యూనివర్సిటీ (డెన్మార్క్) దవాఖాన సైంటిస్టులు 50 ఏండ్లుగా 78 వేల మంది పురుషులపై అధ్యయనం జరిపారు. 'శుక్ర కణాల సంఖ్య 120 మిలియన్ల (ప్రతి మిల్లీలీటరుకు) కంటే ఎక్కువ ఉన్న పురుషులు.. శుక్ర కణాలు 5 మిలియన్లు ఉన్న పురుషుల కంటే 2.7 సంవత్సరాలు ఎక్కువకాలం జీవించారు' అని పరిశోధకురాలు లార్కే ప్రిస్కోర్న్ చెప్పారు. వీర్య కణాల చలనశీలత తక్కువ ఉన్న వ్యక్తి 77.6 సంవత్సరాల వరకు, అధిక చలనశీలత ఉన్న వ్యక్తి 80.3 సంవత్సరాల వరకు జీవించవచ్చునని తెలిపారు.

హమాస్‌తో అమెరికా రహస్య చర్చలు!

వాషింగ్టన్: హమాస్ ఉగ్రవాద సంస్థతో అమెరికా రహస్య చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గాజాలో బందీలుగా ఉన్న అమెరికన్‌లను విడిపించడం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ఈ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. అదే విధంగా, బందీలందరినీ విడుదల చేయడంతోపాటు, ఇజ్రాయెల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపడానికిగల అవకాశాల గురించి కూడా చర్చిస్తున్నట్లు సమాచారం. అమెరికన్ ప్రెసిడెన్షియల్ దౌత్యవేత్త (శరణార్థుల వ్యవహారాలు) ఆడమ్ బోహ్లెర్ నాయకత్వంలో దోహాలో ఈ చర్చలు జరుగుతున్నాయి. హమాస్‌తో నేరుగా అమెరికా గతంలో చర్చలు జరపలేదు. హమాస్‌ను ఉగ్రవాద సంస్థగా అమెరికా 1997లో ప్రకటించింది.

జూలై 3 నుంచి అమర్‌నాథ్ యాత్ర

న్యూఢిల్లీ, మార్చి 5: ఏటా లక్షలాది మంది భక్తులు పాల్గొనే అమర్‌నాథ్ యాత్ర 2025లో జూలై 3న ప్రారంభమవుతుందని 'శ్రీ అమర్‌నాథ్ జీ పుణ్యక్షేత్ర బోర్డ్' (ఎస్ఏఎస్‌బీ) తెలిపింది. ఈ ఏడాది యాత్ర 38 రోజులపాటు సాగుతుందని, ఆగస్టు 9న శ్రావణ పూర్ణిమ రోజున ముగుస్తుందని బోర్డు అధికారులు మీడియాకు తెలిపారు. మంగళవారం జమ్మూకశ్మీర్ ఎల్జీ మనోజ్ సిన్హా ఆధ్వర్యంలో జరిగిన 48వ ఎస్ఏఎస్‌బీ బోర్డు సమావేశంలో యాత్ర షెడ్యూల్‌పై నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు చెప్పారు. 'ఈ ఏడాది కూడా రెండు మార్గాల్లో యాత్ర ఏకకాలంలో మొదలవుతుంది. అనంత్‌నాగ్‌లోని పహల్గామ్ మార్గం, గండేర్‌బల్‌లోని బాల్టల్ దారిలో మొదలయ్యే యాత్ర ఆగస్టు 9తో ముగుస్తుంది' అని బోర్డు అధికార ప్రతినిధి తెలిపారు.

కేదార్‌నాథ్‌కు రోప్‌వే ప్రాజెక్టు
కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్‌లో రెండు రోప్‌వే ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. రూ. 6,881 కోట్ల వ్యయంతో సోన్‌ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్‌కు(12.9 కిలోమీటర్లు), గోవింద్‌ఘాట్ నుంచి హేమ్‌కుండ్ సాహిబ్ జీకి(12.4 కిలోమీటర్లు) రెండు రోప్‌వే ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. క్యాబినెట్ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. సోన్‌ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్‌కు 12.9 కిలోమీటర్ల రోప్‌వే నిర్మాణాన్ని రూ. 4,081కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. రైతులకు జెనెరిక్ పశు ఔషధాల పంపిణీకి రూ. 3,880 కోట్లు కేటాయించినట్టు చెప్పారు.

జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ వద్దు

- అలా చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం
- ప్రస్తుత ఎంపీ స్థానాల విధానమే కొనసాగించాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ ప్రక్రియ చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని, జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలు మాత్రమే లాభపడతాయని కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎంపీ స్థానాల విధానాన్నే కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు కుటుంబ నియంత్రణ పాటించడం వల్ల దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా తక్కువగా ఉన్నదని తెలిపారు. 1971 జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుని లోక్‌సభ స్థానాలను నిర్ణయించారని, ఇక ముందు కూడా ఇదే పద్ధతి కొనసాగించాలని, అవసరమైతే రాజ్యాంగాన్ని సవరించాలని కేంద్రానికి సూచించారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తాజాగా అఖిలపక్ష సమావేశం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ విధానాన్ని తప్పుబట్టారని, ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ పార్టీ స్వాగతిస్తున్నదని తెలిపారు.

అమెరికాలో కాల్పులు.. తెలంగాణ విద్యార్థి మృతి

- దుండగుడి కాల్పుల్లో మరణించిన ప్రవీణ్
- రంగారెడ్డి జిల్లా కేశంపేటలో విషాదఛాయలు

కేశంపేట, మార్చి 5: ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికా వెళ్లిన మరో తెలంగాణ విద్యార్థి మృతి చెందాడు. దుండగుడొకరు జరిపిన కాల్పుల్లో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధిలోని కేశంపేట మండలానికి చెందిన ప్రవీణ్ (27) ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లాడు. విస్కాన్సిన్ మిల్వాంకిలో ఇంటికి సమీపంలోని బీచ్‌లో ఒక దుండగుడు జరిపిన కాల్పుల్లో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్న ప్రవీణ్ మృతి గురించి అతడి స్నేహితులు భారత్‌లోని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఒక్కగానొక్క కుమారుడు మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రవీణ్ మృతితో కేశంపేట మండల కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రెండుసార్లు ఫెయిలైన వ్యక్తి ప్రధాని ఎలా అయ్యాడో?
రాజీవ్‌పై మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు..

న్యూఢిల్లీ, మార్చి 5: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీపై ఆయన సన్నిహిత సహచరుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మణిశంకర్ అయ్యర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చదువులో రెండుసార్లు విఫలమైన రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి ఎలా అయ్యారో అర్థం కావడం లేదని పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో తనతో కలిసి చదువుకున్నప్పుడు రాజీవ్ గాంధీ ఫెయిలయ్యారని, ఆ తర్వాత ఆయన లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీకి వెళ్లి అక్కడ కూడా విఫలమయ్యారని తెలిపారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో చదివినవారు ఫెయిలవడం చాలా అరుదని, తమ విద్యార్థులందరినీ కనీసం పాస్ చేసేందుకైనా ఆ యూనివర్సిటీ ప్రయత్నిస్తుందని, అయినప్పటికీ రాజీవ్ గాంధీ ఫెయిలయ్యారని వివరించారు. సోనియా గాంధీని కలిసేందుకు గత పదేండ్లలో ఒక్కసారి కూడా అపాయింట్‌మెంట్ లభించలేదని, రాహుల్‌తో ఒక్కసారే మాట్లాడానన్నారు.

కలలో నా భార్య రక్తం తాగుతోంది!
నిద్ర పట్టట్లేదు.. అందుకే విధులకు ఆలస్యం
ఉత్తరప్రదేశ్ కానిస్టేబుల్ వింత వివరణ

మీరట్, మార్చి 5: 'ప్రతి రోజూ నా భార్య కలలోకి వచ్చి నా గుండెలపై కూర్చుని నన్ను చంపడానికి రక్తం తాగేందుకు ప్రయత్నిస్తున్నది. ఈ పీడకలలతో నిద్రపట్టక రోజూ ఆఫీస్‌కు ఆలస్యంగా వస్తున్నాను' అంటూ అధికారులకు ఒక కానిస్టేబుల్ ఇచ్చిన సంజాయిషీ పత్రం ఇప్పుడు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. యూపీలోని మీరట్‌లో ప్రొవెన్షియల్ ఆర్మ్డ్ కానిస్టేబులరీ (పీఏసీ) కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఒక వ్యక్తి విధులకు ఆలస్యంగా రావడంతో నోటీస్ ఇచ్చారు. వైవాహిక సమస్యల కారణంగా నిద్రలేమితో బాధపడుతున్నానని, ప్రతి రోజూ తన భార్య కలలోకి వస్తూ నన్ను చంపుతానంటూ బెదిరిస్తున్నదని తెలిపాడు.

లౌకిక పార్టీలు కాంగ్రెస్‌ను నమ్ముతాయా?

- కాంగ్రెస్ వల్లే బీజేపీ విజయాలు
- కేరళ సీఎం విజయన్ ధ్వజం

తిరువనంతపురం, మార్చి 5: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు ఇటీవలి ఢిల్లీ సహా పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి దోహదం చేసిందని ఆయన ఒక వ్యాసంలో ఆరోపించారు. తమ పార్టీ మాత్రమే సంఘ్ పరివార్‌ను వ్యతిరేకిస్తున్నదని కాంగ్రెస్ చెప్పుకుంటున్నదని, కానీ ఇందులో నిజమెంత? అని ఆయన ప్రశ్నించారు. 'హర్యానా, రాజస్థాన్, పంజాబ్, యూపీ, మహారాష్ట్రల్లో కేంద్రం విధానాలపై రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వారి ఆగ్రహం లోక్‌సభ, తర్వాత వచ్చిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిబింబించింది కూడా. అయినప్పటికీ ఆ రాష్ట్రాలలో బీజేపీని అధికారంలోకి తెచ్చింది కాంగ్రెస్ వైఖరే అన్నది విస్పష్టం. ఉనికిలో లేని శక్తిని ప్రదర్శించడం ద్వారా కాంగ్రెస్ లౌకిక ఓట్ల ఏకీకరణను నిరోధించింది' అని విజయన్ తప్పుబట్టారు. బీజేపీని ఓడించాలన్న వారి ఆశలను కాంగ్రెస్ వమ్ము చేసిందని విమర్శించారు.

కాంగ్రెస్‌ది అహంకారపూరిత వైఖరి

బలం లేకపోయినా పోటీ చేస్తూ బీజేపీకి మేలు చేస్తున్న కాంగ్రెస్‌ను ఇతర లౌకిక పార్టీలు నమ్ముతాయా? అని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ అనుసరించిన సెక్యులర్ ఓట్లను విభజించే విచ్ఛిన్న వ్యూహం బీజేపీకి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా అధికారాన్ని కట్టబెట్టిందని అన్నారు. బీజేపీని వ్యతిరేకించే ఇతర ప్రతిపక్ష పార్టీల పట్ల కూడా కాంగ్రెస్ వైఖరి అహంకారపూరితంగా ఉందని ఆయన విమర్శించారు. ఇటీవల జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను పరిశీలిస్తే అక్కడ కాంగ్రెస్ 2015, 2020 నుంచి ఒక్క సీటు కూడా నెగ్గలేదని, తాజా ఎన్నికల్లో ఆ పార్టీకి దక్కింది సున్నా సీట్లేనని అన్నారు. ఆప్‌తో కలవకుండా పోటీ చేసి బీజేపీని గెలిపించాలన్న తన ప్రాథమిక లక్ష్యాన్ని కాంగ్రెస్ నెరవేర్చుకుందని అన్నారు.

యుద్ధమే కావాలంటే అందుకు సిద్ధమే

ట్రంప్ ట్రేడ్‌వార్‌పై చైనా తీవ్రస్పందన

బీజింగ్: వాణిజ్య యుద్ధం కావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పట్టుబడితే అంతం వరకు యుద్ధం చేయడానికి తాము సిద్ధమేనని చైనా ప్రకటించింది. చైనాపై ప్రతీకార సుంకాలు విధిస్తామంటూ ట్రంప్ చేసిన ప్రకటనపై చైనా విదేశాంగ శాఖ ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించింది. చైనా దిగుమతులపై సుంకాలు పెంచడానికి అమెరికా కుంటి సాకులు వెతుకుతోందని విదేశాంగ శాఖ ఆరోపించింది. 'సుంకాల యుద్ధమైనా, వాణిజ్య యుద్ధమైనా లేక వేరే రకం యుద్ధమైనా సరే.. అమెరికాకు యుద్ధమే కావాలనుకుంటే ఏ యుద్ధమైనా చివరి వరకు పోరాడేందుకు మేము సిద్ధం' అంటూ ప్రకటించింది.

కెనడా విలీనానికి కుట్ర: ట్రూడో

ట్రంప్ తమపై విధించిన సుంకాల పట్ల కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యాను మచ్చిక చేసుకునేందుకే ట్రంప్ కెనడాతో వాణిజ్య యుద్ధానికి దిగుతున్నారని ఆయన ఆరోపించారు. ట్రంప్ తమపై 25 శాతం సుంకాలు విధిస్తే తాము అమెరికన్ వస్తువులపై 100 బిలియన్ డాలర్లకు పైగా ప్రతీకార సుంకాలు విధిస్తామని మంగళవారం విలేకరుల సమావేశంలో ట్రూడో ఘాటుగా హెచ్చరించారు. తనకు అత్యంత సన్నిహిత, భాగస్వామి, మిత్ర దేశమైన కెనడాపై నేడు అమెరికా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించిందని ఆయన అన్నారు. అదే సమయంలో ఒక అబద్ధాలకోరు, నరహంతక నియంత అయిన వ్లాదిమిర్ పుతిన్‌ను బుజ్జగించేందుకు రష్యాకు అనుకూలంగా ట్రంప్ వ్యవహరిస్తున్నారని ట్రూడో ఆగ్రహం వ్యక్తం చేశారు. కెనడాను అమెరికాలో విలీనం చేసుకోవాలన్న దురాలోచనతోనే కెనడా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోవాలని ట్రంప్ కోరుకుంటున్నారని ట్రూడో ఆరోపించారు. అలా ఎన్నటికీ జరగనివ్వబోమని, అమెరికాకు చెందిన 51వ రాష్ట్రంగా కెనడాను కానివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. టెక్ దిగ్గజం ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ కంపెనీతో చేసుకున్న 100 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్లు ప్రకటించారు. తమపై అధిక సుంకాలు విధించిన అమెరికాకు కరెంట్ కోతలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గ్రీన్‌లాండ్‌ను ఏదో విధంగా సొంతం చేసుకుంటాం: ట్రంప్

గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలన్న ఆకాంక్షను ట్రంప్ మరోమారు వ్యక్తం చేశారు. మంగళవారం అమెరికా కాంగ్రెస్ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, గ్రీన్‌లాండ్‌ను ఏదో ఒక విధంగా సొంతం చేసుకుంటామని ప్రకటించారు. ఇందుకోసం చేస్తున్న ప్రయత్నాలు విఫలమైనా..ఆపనని అన్నారు. అమెరికాలో కలిసే అవకాశంపై ఆలోచించాలని గ్రీన్‌లాండ్ ప్రజలను కోరారు. ట్రంప్ ఆఫర్లను డెన్మార్క్ తోసిపుచ్చింది.

ఇజ్రాయెల్ తరహాలో అమెరికాకూ గోల్డెన్ డోమ్

ఇజ్రాయెల్ క్షిపణి రక్షణ వ్యవస్థ ఐరన్ డోమ్ తరహాలో అమెరికాలో 'గోల్డెన్ డోమ్'ను ఏర్పాటు చేయాలని ట్రంప్ నిర్ణయించారు. 1981-89 వరకు అమెరికా 40వ అధ్యక్షుడిగా పనిచేసిన రొనాల్డ్ రీగన్ అలాంటి రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని భావించారని, అయితే అప్పట్లో అలాంటి సాంకేతికత లేకపోవడంతో సాధ్యపడలేదన్నారు.

భారత్‌లో మిలియనీర్లు @85,698



దేశంలో మిలియనీర్ల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతున్నది. నిరుడితో పోలిస్తే దేశంలో మిలియనీర్ల సంఖ్య 6 శాతం మేర పెరిగినట్టు గ్లోబల్ ప్రాపర్టీ కన్సల్టెంట్ సంస్థ 'నైట్ ఫ్రాంక్' బుధవారం విడుదల చేసిన ఓ నివేదికలో వెల్లడించింది. దీంతో దేశంలో మొత్తం మిలియనీర్ల సంఖ్య 85,698కు చేరుకొన్నట్టు వివరించింది. పది మిలియన్ డాలర్ల కంటే (రూ. 87 కోట్లు) ఎక్కువ సంపద కలిగి ఉన్నవారిని మిలియనీర్లుగా పిలుస్తారు. ఇదిలాఉండగా కుబేరులు ఎక్కువగా పశ్చిమ దేశాల్లోనే ఉంటారనుకొంటాం. అయితే, సంపన్నులు ఎక్కువగా ఉన్న దేశాల జాబితాలో టాప్-3లో ఇండియా కూడా ఉన్నట్టు 'నైట్ ఫ్రాంక్' నివేదిక వెల్లడించింది. కనీసం రూ. 8,500 కోట్ల కంటే ఎక్కువ సంపద కలిగినవారిని బిలియనీర్లుగా పిలుస్తాం. కాగా ప్రపంచంలోని మొత్తం కుబేరుల సంపద విలువ ఏకంగా రూ.1,275 లక్షల కోట్లకు చేరింది.

మన తెలుగువారూ సంపన్నులే!

దేశంలో 396 మంది కుబేరులతో ముంబై అగ్రస్థానంలో ఉండగా, 217 మందితో ఢిల్లీ రెండో స్థానంలో నిలిచింది. ఇక, 104 మంది సంపన్నులతో హైదరాబాద్ ముచ్చటగా మూడో స్థానాన్ని దక్కించుకొన్నట్టు హురున్ ఇండియా రిచ్‌లిస్ట్-2024 నివేదికలో వెల్లడించింది. మొత్తంగా తెలంగాణలో 109 మంది, ఏపీలో 9 మంది సంపన్నులు ఉన్నట్టు నివేదిక వివరించింది.

బాబోయ్.. ఈ బాదుడేంటి?

- తరచూ ఈ పన్ను వడ్డనలేంటి?
- కర్ణాటక కాంగ్రెస్ సర్కారుపై బ్రూవరీస్ అసోసియేషన్ అసహనం
- నిబంధనల్లో పక్షపాత వైఖరిపై ఆగ్రహం

న్యూఢిల్లీ, మార్చి 5: కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక రాష్ట్రంలో ధరాఘాతానికి సామాన్యులే కాదు వ్యాపార వర్గాలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. వ్యాపార వర్గాలను కూడా సిద్ధరామయ్య ప్రభుత్వ